కలెక్టర్‌ను కలిసిన టీవీపీఎస్ సభ్యులు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దివ్యాంగులు

కొత్తగూడెం అర్బన్, జూన్ 22 : జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జితేష్ వి పాటిల్‌ను శనివారం టీవీపీఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీవీపీఎస్ అధ్యక్షుడు గుండపనేని సతీశ్, కాటి నాగేశ్వరరావు, శైలజ, కళాబాబు రెడ్డి, గట్ల రమేశ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

సిమ్మింగ్ పూల్‌ను పరిశీలించిన జీఎం

మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

రామవరం, జూన్ 22: ఏరియాలోని గౌతంపూర్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన సివిల్ మరమ్మతులు, ఎలక్ట్రికల్ లైటింగ్ పనులను ఏరియా జీఎం శాలెంరాజు సంబంధిత అధికారులతో కలిసి శని వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సివిల్ వారికి స్విమ్మింగ్ పూల్ దగ్గరలో ఉన్న చెట్టు ఆకులు కాయలు పడకుండా మెష్ ఏర్పాటు చేయాలని, స్విమ్మింగ్ పూల్ టైమింగ్స్, స్విమ్మింగ్ పూల్ కోసం వచ్చే వారి వివరాలు, మెడికల్ టెస్టు చేసుకున్న వారికి పర్మిషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, డీజీఎం పర్సనల్ శివకేశవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనీల్, సివిల్ సూపర్‌వైజర్, ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

పీవీకే మ్యాన్‌రైడింగ్ పనితీరును పరిశీలించిన డీడీఎంఎస్

అధికారులతో మాట్లాడుతున్న డీడీఎంఎస్

రామవరం, జూన్ 22: సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే పద్మావతి ఖని మైన్‌లో మ్యాన్‌వైండింగ్ ఇంజన్ పనితీరును హైదరాబాద్ రీజియన్ డీడీఎంఎస్ మెకానికల్ దిలీప్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ దుర్గాప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, గ్రూప్ ఇంజనీర్ ఉపేందర్, పిట్ ఇంజనీర్ శ్రీనివాస్, రక్షణాధికారి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

గోదావరి తీరం వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్

ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్, అధికారులు

భద్రాచలం, జూన్ 22: భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు గోదావరిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటారని, భక్తులు స్నానం చేసే ప్రదేశాల్లో ప్రమాదాలు జరుగకుండా లోతును తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలం గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లిన ఐదుగురు ప్రమాదవశాత్తు మునిగిపోతుండడంతో పక్కనే ఉన్న బోటు నిర్వాహకులు నలుగురిని కాపాడారని, అప్పటికే ఒక బాలుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కలెక్టర్ శనివారం సాయంత్రం ఆప్రాంతాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు గోదావరి లోతు తెలియదని, భక్తులకు తప్పనిసరిగా సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. ఇటువంటి ప్రమాదాలు ఇక ముందు జరుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 24గంటలు గోదావరి తీరంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి సమయంలో భక్తులుగానీ, ప్రజలు గానీ, ఎవరూ గోదావరి పరిసరాలతో తిరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలని, పోలీసు అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట భద్రాచలం ఆర్డీవో దామోదరరావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, సీడబ్ల్యూసీ అధికారులు, పట్టణ సీఐ సంజీవరావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

కొత్తగూడెం అర్బన్, జూన్ 22 : పాల్వంచ పట్టణంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. జిల్లా కమిటీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, జిల్లాలో ఉన్న పార్టీ శాఖ కార్యదర్శులు పాల్గొనాలని పేర్కొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

కొత్తగూడెం సింగరేణి, జూన్ 22 : రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ సిబ్బందికి గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ పంచాయతీ ఎంప్లాయి వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యే కూనంనేని శసాంబశివరావును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాలడుగు భాస్కర్, పాండు, వెంకటయ్య పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్‌గా భిక్షం

ట్రిబ్యునల్ తీర్పునే సమర్థించిన హైకోర్టు

సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చీమపాటి భిక్షం

జూలూరుపాడు, జూన్ 22 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా చీమలపాటి భిక్షం శనివారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా ఇప్పటివరకు కొనసాగిన లేళ్ల వెంకటరెడ్డి ఎన్నిక చెల్లదని గతంలో డైరెక్టర్ యల్లంకి సత్యనారాయణ వరంగల్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో ట్రిబ్యునల్ కోర్టు చైర్మన్ ఎన్నిక చెల్లదని వైస్ చైర్మన్‌గా ఉన్న చీమపాటి భిక్షంను చైర్మన్‌గా కొనసాగించాలని 2023 ఆగస్టు 7న తీర్పు వెల్లడించింది. దీంతో చైర్మన్‌గా భిక్షం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో వెంకటరెడ్డి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకరావడంతో తిరిగి చైర్మన్‌గా ఆయనే కొనసాగారు. దీంతో హైకోర్టు ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు ట్రిబ్యునల్ కోర్టు తీర్పును సమర్థించడంతో కోర్టు ఆదేశాల మేరకు భిక్షం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘం సీఈవో రమణారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ల సమక్షంలో శనివారం బాధ్యతలు చేపట్టారు. భిక్షంకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ యల్లంకి సత్యనారాయణ, కొమ్మినేని పాండురంగారావు, చాపలమడుగు రామ్మూర్తి, కల్లోజి రజిని, లాకావత్ హేమ్లా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు

ఉపాధ్యాయురాలు కరుణకు వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చంద్రుగొండ, జూన్ 22: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదేండ్లకు పైగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయురాలు కరుణ బదిలీ అయ్యారు. ఆమెకు విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. ''మా టీచర్ మాకే కావాలి'' అంటూ, విద్యార్థులు కొద్దిసేపు మారాం చేశారు. ప్రేమతో ఆమెను అడ్డుకున్నారు. ఆ తర్వాత బారులు తీరి, చప్పట్లతో వీడ్కోలు పలికారు.

గొత్తికోయల గ్రామంలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

చంద్రుగొండ, జూన్ 22: మండలంలోని మద్దుకూరు శివారులో గల గొత్తికోయల గ్రామంలో శనివారం ఎర్రగుంట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రియాంక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి, మందులు ఇచ్చారు. చిన్నారులకు టీకాలు వేశారు. సీజనల్ జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

కొత్తగూడె టౌన్, జూన్ 22 : స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌లో 100 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ-ఈ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి అనసూర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. పదినెలల రెసిడెన్షియల్ విధానంలో కోచింగ్ ఉంటుందని, శిక్షణకాలంలో అభ్యర్థులు ఎటువంటి ఉద్యోగం, ఏ ఇతర కోర్సులు చేయరాదని సూచించారు. మరింత సమాచారం కోసం 8121626423 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడె టౌన్, జూన్ 22 : సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ 2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ పరీక్ష) పరీక్ష కోసం ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసైన బీసీ, ఈబీసీ అభ్యర్థులు శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 19 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వచ్చేనెల 18 నుంచి 2025 ఏప్రిల్ 18వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని, మొత్తం 150 మంది అభ్యర్థులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. వచ్చేనెల 7వ తేదీన జరిగే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశం పొందిన వారికి లాడ్జింగ్, భోజన, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5 వేలు, బుక్‌ఫండ్ నిమిత్తం రూ.5 వేలను ఒక్కసారి ఇవ్వనున్నట్లు తలెఇపారు. గ్రంథాలయ సదుపాయం కూడా ఉంటుందన్నారు. శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని, అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 9573859598, 9666436042, 9059793456, 9652161850 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నర్సయ్యకు బీఆర్ఎస్ నాయకుల నివాళి

నర్సయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరకగూడెం, జూన్ 22: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన జీసీసీ డీలర్ కుంజా దశరథం తండ్రి నర్సయ్య(75) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు నర్సయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు రంజిత్ కుమార్, లక్ష్మయ్య, భిక్షపతి, బుచ్చిరాములు, లక్ష్మి, నారాయణ, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

చురుకుగా సాగుతున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ పనులు

నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనం

చర్ల, జూన్ 22: మండలంలోని లక్ష్మీకాలనీలో చేపట్టిన ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. కేంద్రప్రభుత్వం సీపీడబ్ల్యూడీ నిధులు సుమారు రు. 20 కోట్లతో చేపట్టిన ఏకల్య పాఠశాల భవన నిర్మాణం పనులను గతేడాది ప్రారంభించారు. శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామారావు, అధికారులు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న విద్యాసంవత్సరానికి నిర్మాణం పూర్తయి భవనాలు అందుబాటులోకి వస్తాయని ఈఈ తెలిపారు.

చెట్టుకు పునరుజ్జీవం

చెట్టును క్రేన్ సాయంతో ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రామవరం, జూన్ 22: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో వర్క్‌షాప్ నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా వేప చెట్టు వేర్లతో సహా బయటికి వచ్చింది. గాలివానకు నేలకొరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సీఎండీ హరి తహారంపై ఇస్తున్న స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని దానికి పునరుజ్జీవం పోయాలనే లక్ష్యంతో ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈ శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి నూతనంగా నిర్మిస్తున్న డీజీఎం కార్యాలయం ఎదురుగా జేసీబీ సాయంతో ఆరు అడుగుల లోతు గోయ్యి తవ్వి వేప చెట్టును క్రేన్ సాయంతో తీసుకొచ్చి నాటారు. రజాక్, సత్తార్‌పాషా, మహేష్, మనోజ్, చంద్రశేఖర్, అశోక్, శ్రీనివాస్, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు 'పతకాలు'

కొత్తగూడెం క్రైం, జూన్ 22 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్‌శాఖలో విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావంతోపాటు ప్రతిభను కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి పతకాలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఏఆర్ఎస్సైగా పనిచేస్తున్న యు. వెంకటయ్యకు 'శౌర్య' పతకం, ఆర్ఎస్సై కె. శ్రీనివాసులుకి మహోన్నత సేవా పతకం, ఎస్పీ కార్యాలయం అటాచ్‌మెంట్‌లో పనిచేస్తున్న సూరిశెట్టి శ్రీనివాస్, బూర్గంపాడులో హెడ్‌కానిస్టేబుల్ ఎం.డీ ముజామిల్‌కు ఉత్తమ సేవా పతకం అభించింది. అదే విధంగా ఆర్ఎస్సైలు పి. ఓంప్రకాశ్, సీహెచ్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు బాణోత్ రామ్, బోడా నరేశ్‌కుమార్, బి. ఉపేందర్, కె. రవిందర్, టి. రవి, జి. వెంకన్న, ఎం. కోటేశ్వరరావు, ఏఆర్‌పీసీలు ఎస్. హరీష్, ఎం. గణపతి, ఐ వీరబాబు, పీసీలు జి. వినోద్ కుమార్, ఐ. అశోక్, పి. నాగేశ్వరరావు, ఎం.డీ మైమూద్ పాషాకు కఠిన సేవా పతకం లభించింది. టీఎస్ఎస్‌పీ 6వ బెటాలియన్‌కు చెందన ఆర్ఐ పి. ఉదయ్‌కుమార్, ఆర్ఎస్సై జీ. సంతోష్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎస్. నవీన్ కుమార్‌కు సైతం కఠిన సేవా పతకం లభించింది. ఏఎస్సైలు డి. సత్యనారాయణ, షేక్ నిజామ్ అలి, టి. వెంకటరావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్.కే. సైదులు, ఏఆర్‌హెచ్‌సీ వై.వీ.వీవీ. ప్రసాద్, 6వ బెటాలియన్‌కు చెందిన వి. నారాయణరాజుకు సేవా పతకం లభించింది. వీరందరూ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున పతకాలను అందుకోనున్నారు.

కర్నాటికి అండగా నిలుస్తా : పువ్వాడ

రఘునాథపాలెం, జూన్ 22: పోలీసులు అక్రమ కేసుతో అరెస్ట్ చేసిన 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణను నగరంలోని ఇంటి వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను శనివారం పరామర్శించారు. అక్రమ అరెస్టు కారణాలను తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నాయకులు ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, కూరాకుల వలరాజు, బచ్చు విజయ్ కుమార్, బిక్కసాని జశ్వంత్, చిన్ని, నవీన్, గిరి, షకీనా, అప్పారావు, ఉస్మాన్, సాయి పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి

కార్తీక్ మృతదేహం వద్ద విలపిస్తున్న మేనమామ కత్తుల ఏడుకొండలు

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం గోదావరిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన శనివారం ఉదయం పట్టణంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బూర్గంపాడులో ఓ వివాహానికి వచ్చిన ఏలూరు జిల్లా మహదేవపల్లికి చెందిన నలుగురు బాలురు, బాలుర మేనమామ కత్తుల ఏడు కొండలు ఐదుగురు గోదావరిలో స్నానం చేసేందుకు భద్రాచలం పట్టణంలోని స్నానాల రేవులో దిగారు. లోతును గమనించక ఐదుగురు ఒక్కసారిగా నదిలో కొట్టుకు పోతుండడంతో బోటును నడిపే ప్రసాద్, ఆయన సహచారులు వారిని ఒడ్డుకు చేర్చారు. వారిలో అంగులూరి కార్తీక్ (11) కొన ఊపిరితో ఉండడంతో ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కార్తీక్ మేనమామ కత్తుల ఏడుకొండలు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్

చండ్రుగొండ, జూన్ 22: మండలంలోని సుంకరబంజర, టేకులబంజర గ్రామాల్లో గుడుంబా తయారుచేస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ ఎస్సై రమేష్ శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బెల్లం, పటిక స్వాధీనపర్చుకున్నారు. వారిని తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బైండోవర్ చేశారు.

వరకట్న వేధింపులు తాళ లేక వివాహిత ఆత్మహత్య

లక్ష్మీదేవిపల్లి, జూన్ 22 : మండలంలోని చాతకొండ పంచాయతీలో వరకట్న వేధింపులు తాళలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నడిగూడెం బృందావనపురం గ్రామానికి చెందిన బాలబోయిన మానస(20)కు లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గ్రామానికి చెందిన సంతోష్‌తో వివాహం జరిగింది. కొన్ని నెలలపాటు వీరి దాంపత్య జీవితం ప్రశాంతంగా ఉంది. బాబు కూడా ఉన్నాడు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించడంతో మానస శుక్రవారం పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, జూన్ 22 : వ్యక్తిని దూషించి బెదిరించిన ఘటనలో కేశవాపురానికి చెందిన నలుగురిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవాపురం గ్రామానికి చెందిన బానోతు వీరూనాయక్‌కు శివార్లలో వ్యవసాయ భూమి ఉంది. అందులో టేకు చెట్లను పెంచాడు. ఆ టేకు చెట్లలో మూడింటిని అదే గ్రామానికి చెందిన బానోత్ రాజు, రమేశ్, సాయిచరణ్‌కు శుక్రవారం నరికి తీసుకెళ్తుండగా వీరూనాయక్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అటవీశాఖ వారు ఆ చెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాజు అతడి భార్య అరుణ, రమేశ్, చరణ్‌లు వీరూనాయక్ ఇంటికి వచ్చి అటవీశాఖ అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేశావని బెదిరించి దుర్భాషలాడి దౌర్జన్యం చేశారు. వీరూనాయక్ పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేయడంతో రాజు, అరుణ, రమేశ్, చరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిని బలిగొన్న అంధత్వం

చండ్రుగొండ, జూన్ 22: ఓ వృద్ధురాలి అంధత్వం.. ఆమె ప్రాణాలను బలిగొంది. ఆమె కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని తుంగారం గ్రామస్తురాలు అప్పికుంట్ల ముత్యం(65), కొన్నేండ్లుగా కళ్లు కనిపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నది. శనివారం ఉదయం గ్రామంలోని కుమారుడి ఇంటికి వెళ్తున్నది. ఒక చోట ఆగి ఉన్న ట్రాక్టర్ ఇంజిన్‌కు తల తగలడంతో స్పృహ తప్పి పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమె, గ్రామంలోని ప్రైవేటు ఆసుపత్రికి గ్రామస్తులు తరలించే లోపే మృతి చెందింది. ఆమె కుమారుడు వెంకన్న పిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

బూర్గంపాడు, జూన్ 22: ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మర్రికుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని మర్రికుంట గ్రామానికి చెందిన బొర్రా రాములు (45) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి గ్రామంలో రోడ్డు దాటుతుండగా భద్రాచలం నుంచి పాల్వంచ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు భద్రాచలం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం మృతుడు అన్నయ్య మునయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కరకగూడెం, జూన్ 22: పురుగుమందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొగిలితోగు గ్రామానికి చెందిన అరెం శోభన్‌బాబు (36) శుక్రవారం రాత్రి కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం మత్తులో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కొత్తగూడెం అర్బన్, జూన్ 22 : విధి నిర్వహణ సమయంలో పాఠశాలలో ఉండకుండా వెళ్లిపోయిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటేశ్వరచారి ఉత్తర్వులు జారీ చేశారు. నెహ్రూబస్తీ పాఠశాల ఉపాధ్యాయుడు ఫణిభాస్కర్ విధులకు హాజరై పై అధికారులకు సమాచారం చెప్పకుండానే బయటికి వెళ్లిపోవడంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

ఉరేసుకొని యువకుడు మృతి

బూర్గంపాడు, జూన్ 22: ఉరేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మోరంపల్లి బంజర గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బర్ల హేమంత్ (22) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తల్లి శాంత వారపుసంతకు వెళ్లి వచ్చే సమయానికి ఇంట్లో ఉరేసుకొని మృతిచెంది ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఏడాది క్రితం మృతుడి తండ్రి ప్రమాదంలో మృతిచెందడంతో మనస్థాపంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శనివారం మృతుడు అన్నయ్య వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బూర్గంపాడు ఎస్సై సుమన్ తెలిపారు.

లిటిల్‌ఫ్లవర్స్ జూనియర్ కాలేజ్
2024 ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మార్కులతో
State 2nd 467 MD. Sana Thabassum H.T.No. 2444103093 MPC
State Top Marks 436 Vonteddu Glory H.T.No. 2444103633 BiPC
State Topper 489 MD. Arshiya Sultana H.T.No. 2444103086 CEC
MPC, BIPC, CEC, HEC, MEC, E/M & T/M
అడ్మిషన్లు జరుగుచున్నవి
మెడికల్ కాలనీ, భద్రాచలం
Cell : 9866810122, 9121183410

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

కొత్తగూడె టౌన్, జూన్ 22 : స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌లో 100 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ-ఈ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి అనసూర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. పదినెలల రెసిడెన్షియల్ విధానంలో కోచింగ్ ఉంటుందని, శిక్షణకాలంలో అభ్యర్థులు ఎటువంటి ఉద్యోగం, ఏ ఇతర కోర్సులు చేయరాదని సూచించారు. మరింత సమాచారం కోసం 8121626423 నంబర్‌కు సంప్రదించాలని అనసూర్య కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మణుగూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **గొర్రె